వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
శుక్రవారం, సెప్టెంబర్ 18, 2026

"పాలిటిక్స్ బియాండ్ క్యాస్ట్" సదస్సు

ఈటల రాజేందర్ సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : హైదరాబాద్‌లోని తాజ్ డెక్కన్ హోటల్‌లో నిర్వహించిన "పాలిటిక్స్ బియాండ్ క్యాస్ట్" రౌండ్ టేబుల్ సమావేశంలో ఎంపీ ఈటల రాజేందర్ కుల రాజకీయాలు, రిజర్వేషన్లు, సామాజిక మార్పుపై కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలో కులం ప్రాతిపదికన జరుగుతున్న రాజకీయాలపై ఆయన తీవ్ర ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. బంజారాహిల్స్‌లోని తాజ్ డెక్కన్ హోటల్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఈటల రాజేందర్ పాల్గొని మాట్లాడారు. దేశంలో కుల వ్యవస్థ, రాజకీయాల తీరుతెన్నులపై ఆయన స్పష్టమైన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఆయన చేసిన ముఖ్యమైన వ్యాఖ్యలు ఇక్కడ చూద్దాం: దేశంలో కులం లేకుండా రాజకీయాలు లేవని, మన దేశంలో ఒకే కులం అన్ని రాష్ట్రాల్లో ఒకేలా లేదని, దేశంలోని అన్ని కులాలు ఏదో ఒక రాష్ట్రంలో రిజర్వేషన్లు అనుభవిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. మనకు కేవలం రిజర్వేషన్లు మాత్రమే కాకుండా.. మనిషిని మనిషిగా చూసే నిజమైన మానవత్వం కావాలని ఈటల ఆకాంక్షించారు. రాజ్యాంగ స్ఫూర్తిని పూర్తిగా అర్థం చేసుకుని, దాన్ని సమగ్రంగా అమలు చేసే సంకల్పం ఉన్న నాయకత్వం ఉంటేనే రాజ్యాంగ ఫలాలు అందరికీ అందుతాయని తెలిపారు. రాబోయే 10 సంవత్సరాలలో రిజర్వేషన్లు తొలగిపోవాలని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోరుకుంటే.. స్వతంత్రం వచ్చి 80 ఏళ్లు గడుస్తున్నా నేడు 'ఏబీసీడీ వర్గీకరణ' కావాలని కోరే దుస్థితిలో ఉన్నామని, ఇది పురోగమనమా లేక తిరోగమనమా అన్నది అందరూ ఆలోచించాలని అన్నారు. సమస్యలను పరిష్కరించే సత్తా కోల్పోయిన పాలకులు.. కులతత్వం (క్యాస్టిజం), మతతత్వం (కమ్యూనలిజం), ప్రాంతీయతత్వం (రీజనలిజం) వంటి అంశాలను రాజకీయ ఆయుధాలుగా వాడుకుంటారని 50 ఏళ్ల క్రితమే ఓ డాక్యుమెంట్‌లో స్పష్టంగా చెప్పారని గుర్తుచేశారు. పాలకులు ఎప్పుడూ ప్రజల సంక్షేమం కోసం రాయితీలు ఇవ్వరని, కేవలం అధికారం కోసం (పవర్ కోసం) జరిగే ఘర్షణల్లో భాగంగానే తాయిలాలు ఇస్తారని అప్పట్లోనే చెప్పారన్నారు. సమాజంలో మనిషిని మనిషిగా చూడలేని ఇలాంటి సామాజిక రుగ్మతలు ఏదో ఒక రోజు కచ్చితంగా అంతమవుతాయని, ప్రతి ఒక్కరూ మార్పు కోసం ప్రయత్నిస్తూ ముందుకు పురోగమించాలని ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు.

బీఆర్ఎస్ హయాంలోనే 22(ఏ)లో లక్షలాది ఎకరాలు..

• కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తగ్గింపు: సత్యం శ్రీరంగం



సంగారెడ్డి, వాయిస్ ఆఫ్ వందే భారత్ : గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పేరుతో ఏకంగా 22.93 లక్షల ఎకరాలను 22(ఏ) నిషేధిత జాబితాలో పెట్టిందని టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ విస్తీర్ణాన్ని గణనీయంగా తగ్గించామని, ప్రస్తుతం కేవలం 3.75 లక్షల ఎకరాలు మాత్రమే ఆ జాబితాలో ఉందని స్పష్టం చేశారు. కేసీఆర్ ఆదేశాల మేరకు కేటీఆర్, హరీష్ రావు 22(ఏ) జాబితా విషయంలో తప్పుడు ప్రచారం సాగిస్తున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం ధ్వజమెత్తారు. సంగారెడ్డిలో జిల్లా కాంగ్రెస్ కమిటీ (DCC) అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డితో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో ధరణి తెచ్చి భూములను నిషేధిత జాబితాలో పెట్టిన వారే.. ఇప్పుడు కోటి ఎకరాలు 22(ఏ)లో ఉందంటూ అవాకులు చవాకులు పేలుతున్నారని విమర్శించారు. ధరణి పోర్టల్ ద్వారా అప్పట్లో ఏకంగా 22.93 లక్షల ఎకరాలను 22(ఏ) నిషేధిత జాబితాలో చేర్చారు. కాంగ్రెస్ హయాం: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్తశుద్ధితో ఈ సమస్యకు పరిష్కారం చూపుతూ.. ప్రస్తుతం ఆ జాబితాలోని భూమిని కేవలం 3.75 లక్షల ఎకరాలకు తగ్గించామని ఆయన వివరించారు. గత తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలనలో ధరణిని అడ్డుపెట్టుకుని అధికార పార్టీ నేతలు అడ్డగోలుగా అసైన్డ్ భూములను దోచుకున్నారని ఆరోపించారు. త్వరలోనే ఆ భూముల వివరాలన్నింటినీ బయటపెడతామన్నారు. బిల్లులు రాక ఎంతోమంది సర్పంచులు ఆత్మహత్యలకు పాల్పడటానికి కేసీఆర్ పాలనే కారణమని ఆరోపించారు. లక్ష కోట్లు ఖర్చు పెట్టి కాళేశ్వరం కట్టి రాష్ట్రాన్ని దివాలా తీయించారని మండిపడ్డారు. అప్పుల భారం ఉన్నప్పటికీ.. కాంగ్రెస్ ప్రజాపాలనలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు సీఎం రేవంత్ రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారని కొనియాడారు. ఫామ్‌హౌస్ ముందు డప్పు కొట్టిన దళితులను అవమానించి, ఆ రోడ్లను పసుపు నీళ్లతో శుద్ధి చేసిన చరిత్ర బీఆర్ఎస్ నాయకులదని విమర్శించారు.

• బీజేపీ, బీఆర్ఎస్ లపై ఆరోపణలు:

బీజేపీ ఎంపీ రఘునందన్ రావు కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటే అనడం విడ్డూరంగా ఉందని సత్యం శ్రీరంగం అన్నారు. వాస్తవానికి బీఆర్ఎస్ పార్టీతో లోపాయికారి ఒప్పందం చేసుకుంది బీజేపీనేనని, అందుకే ఆ పార్టీ తరపున ఎంపీలు గెలిచారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ 30 నెలల కాలంలో అన్ని వర్గాలకు న్యాయం చేస్తూ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ముందుకు తీసుకెళ్తోందని చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి తోపాజి అనంత కిషన్, కాంగ్రెస్ సంగారెడ్డి నియోజకవర్గ ఇంచార్జ్ చేర్యాల ఆంజనేయులు, సీడీసీ చైర్మన్ గడీల రామ్ రెడ్డి, రఘు గౌడ్, మునిపల్లి సత్యనారాయణ, కూన సంతోష్, పట్టణ అధ్యక్షులు కిరణ్ గౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు శ్రీహరి పాల్గొన్నారు.

బీసీ జనాభాను తక్కువగా చూపే కుట్ర జరుగుతోంది



▪ తెలంగాణ రక్షణ సేన చీఫ్ కవిత

హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న జనగణనలో బీసీ కులాల జనాభాను తక్కువగా చూపేందుకు కుట్ర జరుగుతోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. బీసీల ఐక్యతను దెబ్బతీసేలా కాకుండా, ప్రతి ఉపకుల్యాన్ని ప్రత్యేకంగా పరిగణలోకి తీసుకుని లెక్కించాలని ఆమె డిమాండ్ చేశారు. బీసీ కులాల జనాభాను తక్కువగా చూపి, వారు ఐక్యంగా పోరాడకుండా కేంద్ర ప్రభుత్వం రాజకీయ కుట్ర చేస్తోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. జనగణనలో ఓబీసీ కాలాన్ని కులాల వారీగా స్పష్టంగా చూపకుండా, బలహీన వర్గాలను విడగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని మండిపడ్డారు. బంజారాహిల్స్‌లోని ఓ హోటల్‌లో శుక్రవారం 'ది యునైటెడ్ ఫోరం ఫర్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్, సకల జన సేవా సంస్థాన్' ఆధ్వర్యంలో నిర్వహించిన "పాలిటిక్స్ బియాండ్ క్యాస్ట్" సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

• ఉపకులాల గణన తప్పనిసరి:

కేవలం ఒకే కాలమ్ పెట్టేసి చేతులు దులుపుకుంటే సరిపోదని, ప్రతి రాష్ట్రంలోని కులాల జాబితాతో పాటు ఉపకులాలను కూడా విడివిడిగా లెక్కించాలని కవిత డిమాండ్ చేశారు. ఒకే కులానికి సంబంధించి దేశంలో ఒక్కో రాష్ట్రంలో ఒక్కో స్టేటస్ ఉందని, ఉపకులాలను కలపకపోతే వారికి తీవ్ర అన్యాయం జరుగుతుందని హెచ్చరించారు. కుల గణనకు ఇంకా నాలుగు నెలల సమయం ఉందని, ఈ లోగా కేంద్ర ప్రభుత్వం తప్పులను సరిదిద్దుకుని స్పష్టత ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కుల గణన పేరుతో బీసీ జనాభాను తక్కువ చేసి చూపిందని ఆమె ఆక్షేపించారు. కుల వివక్ష అనేది మన డీఎన్ఏలోనే పాతుకుపోయిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రపతి, స్పీకర్ లాంటి అత్యున్నత స్థానాల్లో ఉన్నవారు సైతం కుల వివక్షకు గురికావడం అన్యాయమన్నారు. మారోజు వీరన్న ఆశయాల ప్రకారం ప్రతి కులాన్ని ఆర్థికంగా, రాజకీయంగా సాధికారత (ఎంపవర్) సాధించేలా చూడాలని, చట్టాలతో పాటు ఆలోచనా విధానంలో మార్పు వస్తేనే కుల వివక్ష నిర్మూలన సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు.

• మహిళలకు సమాన వేతనం అందాలి:

అంతర్జాతీయ సమాన వేతన దినోత్సవం సందర్భంగా ఆమె ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ.. పురుషులతో సమానంగా శ్రమిస్తున్నప్పటికీ మహిళలకు వేతనాల్లో వ్యత్యాసం చూపడం అన్యాయమన్నారు. 2026లోనూ ఈ వివక్ష కొనసాగడం బాధాకరమని, మహిళల శ్రమకు తగిన విలువనిచ్చినప్పుడే నిజమైన పురోగతి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

19 నుంచి ఎన్ఐటీ వరంగల్ 24వ స్నాతకోత్సవం

• 1,997 మందికి పట్టాలు.. ఘనంగా ఏర్పాట్లు

వరంగల్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : జాతీయ సాంకేతిక సంస్థ (నిట్) వరంగల్ 24వ స్నాతకోత్సవం సెప్టెంబర్ 19, 20 తేదీల్లో అత్యంత వైభవంగా జరగనుంది. అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్‌లో రెండు రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో అండర్‌గ్రాడ్యుయేట్, పోస్ట్‌గ్రాడ్యుయేట్ మరియు పీహెచ్‌డీ విభాగాలకు చెందిన మొత్తం 1,997 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేయనున్నారు. ఎన్ఐటీ వరంగల్ 24వ స్నాతకోత్సవానికి సర్వం సిద్ధమైంది. ఈ మేరకు శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ ప్రొఫెసర్ విద్యాధర్ సుబుధి, డిప్యూటీ డైరెక్టర్ ప్రొఫెసర్ రతీష్ కుమార్, డీన్ అకడమిక్ ప్రొఫెసర్ వెంకయ్య చౌదరి, రిజిస్ట్రార్ శ్రీ సునీల్ కుమార్ మెహతా వివరాలను వెల్లడించారు. సెప్టెంబర్ 19, 20 ఉదయం 10:00 గంటలకు ఎన్ఐటీ వరంగల్, అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్ లో 24వ స్నాతకోత్సవం ప్రారంభమవుతుందని ఎన్ఐటీ వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ విద్యాధర్ సుబుధి, డిప్యూటీ డైరెక్టర్ ప్రొఫెసర్ రతీష్ కుమార్ తెలిపారు. సెప్టెంబర్ 19న యూజీ (అండర్‌గ్రాడ్యుయేట్) పట్టభద్రులకు డిగ్రీల ప్రదానం. సెప్టెంబర్ 20న పీజీ (పోస్ట్‌గ్రాడ్యుయేట్), పీహెచ్‌డీ పట్టభద్రులకు డిగ్రీల ప్రదానం ఉంటుందన్నారు. అలాగే, అండర్‌గ్రాడ్యుయేట్ : 930చ పోస్ట్‌గ్రాడ్యుయేట్: 945, పీహెచ్‌డీ : 100, ఎగ్జిట్ డిగ్రీలు: 22, మొత్తం: 1,997 డిగ్రీలు అందజేయనున్నారు. ముఖ్య అతిథిగా టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సంతోష్ కుమార్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఎన్ఐటీ వరంగల్ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్‌పర్సన్, సైయంట్ వ్యవస్థాపక చైర్మన్ డా.బి.వి.ఆర్.మోహన్



రెడ్డి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించనున్నారు. ఇంజినీరింగ్, సాంకేతిక రంగాలకు విశిష్ట సేవలు అందించిన ఇద్దరు ప్రముఖులకు ఈ వేదికపై గౌరవ డిగ్రీలు ప్రదానం చేయనున్నారు. డా. పద్మనాభన్ కె.మీనన్‌కు విమానయాన, అంతరిక్ష ఇంజినీరింగ్ రంగంలో చేసిన విశిష్ట కృషికి గుర్తింపుగా డాక్టర్ ఆఫ్ సైన్స్ డిగ్రీ. శ్రీ ఆనంద్ రామమూర్తికి సెమీకండక్టర్ రంగంలో విజనరీ లీడర్‌షిప్ అందించినందుకు గౌరవ డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ డిగ్రీ అందజేయనున్నారు. డైరెక్టర్స్ గోల్డ్ మెడల్ కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలో అత్యధిక ప్రతిభ కనబరిచిన సిద్ధి బార్పుటే అందుకోనున్నారు. డైరెక్టర్స్ గోల్డ్ మెడల్ ను ఎం.టెక్ స్మార్ట్ ఎలక్ట్రిక్ గ్రిడ్‌లో అడెపు అంజలి, ఎం.ఎస్‌సి. (టెక్) ఇంజినీరింగ్ ఫిజిక్స్‌లో జాలుమెడి భరణి ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్స్ సాధించారు. వివిధ బ్రాంచ్‌లలో ప్రథమ స్థానంలో నిలిచిన ప్రియాన్షు కుమార్ సింగ్ (సివిల్), నలజాల జోషిత్ (ఈఈఈ), వలుసా రఘువరన్ (మెకానికల్), దొండపాటి లోకేశ్వర్ (ఈసీఈ), మదగాని సాత్విక్ (మెటలర్జీ), జయంతి అను (సీఎస్ఈ), అమన్ అబ్దుల్సమద్ ఇనామ్‌దార్ (బయోటెక్నాలజీ) రోల్ ఆఫ్ ఆనర్ గోల్డ్ మెడల్స్ అందుకోనున్నారు. అలాగే ఉత్తమ ప్రాజెక్ట్ వర్క్, డిసర్టేషన్ విభాగాల్లో బుద్ధ జెశ్వంతి, అట్కురే సార్థక్ వినోద్, డా. అపూర్వ బోరా అవార్డులు అందుకోనున్నారు.